క్లుప్తంగా

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు (కిలో రూపాయల్లో) ... టమాట 25, పచ్చిమిర్చి 50, బెండ 40, కాకర 60, దొండ 30, దోస 30, ఆలు 25, చామగడ్డ 50, కీర 30, బీర 50, వంకాయ 40, గోకర 50, బీన్స్ 100, బీట్‌రూట్ 30, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 25, క్యారెట్ 50, చిక్కుడు 80, ఉల్లి 100 (5 కేజీలు), ములక్కాయలు (2) 10 , క్యాలీఫ్లవర్ (1) 40 సొరకాయ 20, అల్లం 220, వెల్లుల్లి 130

మహిళలకు నైపుణ్య శిక్షణ

హఫీజ్‌పేట్: కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్ నీలం రాజశేఖర రెడ్డి రీసర్చ్ సెంటర్‌లో మహిళలకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ నిర్వహిస్తున్నారు. మహిళలకు స్వయం ఉపాధి కోసం టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మగ్గం, డైయింగ్, ప్రింటింగ్, బ్యూటీషియన్, స్పోకెన్ ఇంగ్లీష్, ట్యాలీ, డీటీపీ తదితర శిక్షణ ఉచితంగా అందిస్తున్నారు. ఆసక్తిగల వారు పూర్తి వివరాలకు 9246530048 నెంబరుకు ఫోన్ చేయవచ్చు.

సీపీఆర్‌పై పోలీసులకు అవగాహన



రాయదుర్గం పీఎస్‌లో సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

గచ్చిబౌలి: రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పోలీసులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. సోమవారం రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో అవగాహన శిబిరం ఏర్పాటు చేశారు. గుండె పోటుకు గురైన వారికి సకాలంలో సీపీఆర్ చేస్తే ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చని స్టార్ హస్పిటల్ వైద్యులు వివరించారు. సీపీఆర్‌పై అవగాహనతో ఎంతో మందికి మేలు జరుగుతుందన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

రీజినల్ పీఎఫ్ కమిషనర్‌విశాల్ అగర్వాల్



పెన్షన్ పత్రాలను అందిస్తున్న రీజినల్ పీఎఫ్ కమిషనర్ విశాల్ అగర్వాల్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భవిష్యనిధి సంస్థ ప్రతీనెల నిర్వహించే నిధి ఆప్ కే నిఖత్ కార్యక్రమాన్ని సోమవారం భారతినగర్ డివిజన్ పరిధిలోని విద్యుత్‌నగర్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి రీజినల్ పీఎఫ్ కమిషనర్ విశాల్ అగర్వాల్ హాజరై మాట్లాడారు. ప్రతీ నెల ఈపీఎస్ చందాదారులు, పెన్షన్‌దారుల సమస్యలను పరిష్కారించేందుకు ఈ శిబిరాలను నిర్వహిస్తామన్నారు. ఇందులో వారి సమస్యలను పరిష్కారిస్తున్నామన్నారు. ప్రయాస్ పథకంలో భాగముగా మేలో వివిధ పరిశ్రమలు, సంస్థల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చెందిన 25 మంది పెన్షన్‌దారులకు పెన్షన్ మంజూరు చేసినట్లు తెలిపారు. 13 మందికి పత్రాలు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ ఆర్.శ్రీదేవి, అధికారుల జీవి రావు, బబుల్ నాథ్ నాయక్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, నాయకులు

పటాన్‌చెరు: సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రతీపల్లె ప్రగతికి నిదర్శనంగా నిలుస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామంలో రూ.9 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న అంతర్గత మురుగు నీటి కాల్వల నిర్మాణ పనులకు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తూ పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నామన్నారు. ప్రభుత్వం విడుదల చేసే నిధులతో పాటు వివిధ పరిశ్రమల సహకారంతో సీఎస్ఆర్ నిధులను కేటాయిస్తూ గ్రామాలను అభివృద్ధికి ప్రతీకలుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, సీనియర్ నాయకులు దశరథ రెడ్డి, వెంకట్ రెడ్డి, గ్రామ సర్పంచ్ మధు, ఎంపీటీసీలు మంజుల శ్రీశైలం, మాధవి నరేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ విష్ణు వర్ధన్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అట్టహాసంగా ఆరంభమైన సీఎం కప్ పోటీలు





జీఎంసీ బాలయోగి స్టేడియంలో సీఎం కప్-2023 క్రీడాపోటీల దృశ్యాలు

హాకీ క్రీడాకారులతో శాట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్ తదితరులు



గచ్చిబౌలి: సీఎం కప్-2023 రాష్ట్ర స్థాయి పోటీలు సోమవారం అట్టహాసంగా ఆరంభమయ్యాయి. రాష్ట్ర శాట్స్ చైర్మన్ డాక్టర్ ఆంజనేయగౌడ్ గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలోని స్పోర్ట్ కాంప్లెక్స్‌లో ప్రారంభించారు. సీఎం కప్ పోటీలలో ఫుట్‌బాల్, షటిల్, హాకీ క్రీడాపోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడలకు సీఎం కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోందన్నారు. క్రీడా మైదానాల్లో అనేక మౌలిక వసతుల కల్పనకు అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్ మోహన్‌రావు, హైదరాబాద్ బ్యాడ్మింటన్ జిల్లా కార్యదర్శి చాముండేశ్వరినాథ్, వందలాది మంది క్రీడాకారులు, పీఈటీలు, కోచ్‌లు పాల్గొన్నారు.

నల్లగండ్లలో చిమ్మ చీకట్లు



నల్లగండ్ల కమ్యూనిటీ హాల్ రోడ్డులో చిమ్మచీకట్లు నెలకొన్న దృశ్యం

ఐదు రోజులుగా వెలగని వీధిలైట్లు

శేరిలింగంపల్లి: వీధిలైట్లు వెలుగక రాత్రి వేళల్లో వీధుల్లో చిమ్మచీకట్లు నెలకొంటున్నాయి. దీంతో గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐదు రోజులుగా నల్లగండ్లలోని కమ్యూనిటీ హాల్ రోడ్డులో స్ట్రీట్ లైట్లు వెలగక ఇబ్బందులకు గురయ్యారు. రాకపోకలు సాగించేందుకు పాదచారులు అసౌకర్యానికి గురవుతున్నారు. వీధిదీపాల నిర్వహణ సక్రమంగా లేదని, అధికారుల దృష్టికి తెచ్చినా ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు. గతంలో వీధిదీపాలు ఒక్కటి వెలుగకపోయినా సిబ్బంది వచ్చి వెంటనే సరి చేయడమో, కొత్త వాటిని ఏర్పాటు చేయడమో చేసేవారని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్నాళ్ళుగా వీధిదీపాలు ఎప్పుడు వెలుగుతాయో, ఎప్పుడు వెలుగవో అర్థం కావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని పగటి పూట కూడా వెలుగుతున్నా, రాత్రి వేళల్లో వెలుగడం లేదని ఫిర్యాదులు చేసినా ఎవరూ పట్టనట్లు వ్యవహరించడం తగదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్ట్రీట్ లైట్లనిర్వహణపై జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు పర్యవేక్షించేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.. ఇప్పటికైనా అధికారులు ఈ విషయంతో తగిన చొరవ తీసుకొని వీధిదీపాల సమస్య పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

బస్తీ దవాఖానాలో వసతులేవీ?



కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రేమ్‌నగర్ బస్తీ దవాఖానా

హఫీజ్‌పేట్: కొండాపూర్ డివిజన్ పరిధిలోని న్యూహఫీజ్‌పేట్ ప్రేమ్‌నగర్ బస్తీలో కమ్యూనిటీ హాల్ కోసం నిర్మించిన భవనం సమస్యల వలయంలో చిక్కుకుంది. ఇందులో అట్టహాసంగా ప్రారంభించిన బస్తీ దవాఖానకు వైద్యులకు, రోగులకు కావలసిన కనీస వసతులు కల్పించలేదు. దవాఖానాలలో మంచినీటి కనెక్షన్ లేకపోవడం, పారిశుద్ధ్యంపై అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. బస్తీ దవాఖానాలో ఒక డాక్టర్, ఇద్దరు నర్సులు విధులు నిర్వహిస్తున్నారు. వారికి కనీసం వసతులు కల్పించలేకపోవడంపై ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలు ఇవే....

- ఇష్టానుసారంగా దవాఖానాలో వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు.
- బస్తీ దవాఖానాలో కుళాయి ద్వారా నీళ్ళు రావడం లేదు.
- మంజీరా మంచినీటి పైప్‌లైన్ లేకపోవడంతో ట్యాంకర్ ద్వారా నీళ్ళు అందిస్తున్నారు.
- దవాఖానా చుట్టు పాత ప్రహరీ బీటలు వారి కూలిపోయింది.
- ప్రధాన గేటు ద్వారం ముందే చెత్త చెదారం వేస్తున్నారు.
- రాత్రి సమయాలలో ట్రాక్టర్ల ద్వారా దవాఖానా ఆవరణలో మట్టి పోస్తున్నారు.
- ప్రహరి గోడ చుట్టు పిచ్చి మొక్కలు పెరిగి దోమల స్వైర విహారం చేస్తున్నాయి.
- మరుగుదొడ్ల నిరుపయోగంగా మారాయి.

స్టార్టప్‌ల ఏర్పాటుకు నగరంలో అనేక అవకాశాలు



ఎక్సలెన్స్ అవార్డులను అందజేస్తున్న చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి

చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు డాక్టర్ రంజిత్‌రెడ్డి

గచ్చిబౌలి: ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నూతన సంస్థల ఏర్పాటుకు హైదరాబాద్ నగరంలో కొదువ లేదని చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు డాక్టర్ రంజిత్ రెడ్డి పేర్కొన్నారు.గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలోని శాంతిసరోవర్‌లో సహాయ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అందజేసే ఎక్సలెన్సీ అవార్డులను రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావుతో కలిసి ఆదివారం రాత్రి అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌లో నూతనంగా సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, స్టార్టప్‌ల ఏర్పాటుకు పుష్కలంగా అవకాశాలు ఉన్నాయన్నారు. ఆసియా ఖండంలో ఎక్కడా లేని సౌకర్యాలు, సౌలభ్యాలు హైదరాబాద్ నగరంలో తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తోందన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

మియాపూర్: పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, ఉప్పలపాటి శ్రీకాంత్, నార్నె శ్రీనివాస్‌రావు, మంజులరఘునాథ్‌రెడ్డిలతో కలిసి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పథకాల అమలులో తెలంగాణ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు రఘుపతిరెడ్డి, మోహన్‌గౌడ్ పాల్గొన్నారు.

సహజ వనరులను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: రోజురోజుకీ పెరుగుతున్న వాహన కాలుష్యం నిరోధించాలంటే సీఎన్జీ వినియోగం పెరగాల్సిన ఆవశ్యకత ఉందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండలం పరిధిలోని ఐనోలు గ్రామ శివారులో నూతనంగా ఏర్పాటు చేసిన టోరెంట్ సీఎన్ గ్యాస్ స్టేషన్‌ను సోమవారం ఉదయం స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎన్జీ గ్యాస్ వినియోగిస్తే డబ్బు ఆదా కావడంతో పాటు కాలుష్య తీవ్రతను తగ్గించవచ్చన్నారు. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ఇంద్రేశం గ్రామ పరిధిలో ఇంటింటికి పైప్‌లైన్ ద్వారా గ్యాస్ అందించేందుకు టోరెంట్ యాజమాన్యం శ్రీకారం చుట్టడంపై అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఇంద్రేశం గ్రామ సర్పంచ్ నరసింహ, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, పటాన్‌చెరు సీఐ వేణుగోపాల్ రెడ్డి, డీఐ లల్లు నాయక్, టోరెంట్ గ్యాస్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీధర్, వైస్ ప్రెసిడెంట్ మధుకర్ రావు, జనరల్ మేనేజర్ రాంబాబు, సీనియర్ నాయకులు రామచంద్రా రెడ్డి, శంకర్ రెడ్డి, శంకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సీఎన్జీ గ్యాస్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

బీఆర్ఎస్ నాయకులకు ప్రజా సమస్యలు పట్టవు

గచ్చిబౌలి: బీఆర్ఎస్ నాయకులకు కబ్జాలు, వసూళ్ళు తప్ప ప్రజా సమస్యలు పట్టవని బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ విమర్శించారు. 42వ రోజు కొండాపూర్ డివిజన్ రాఘవేంద్రకాలనీ సీ బ్లాక్ ప్రాంతంలో గడపగడపకూ బీజేపీ కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం నుంచి పాదయాత్ర నిర్వహించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజలకు హంగు ఆర్భాటాలు కాదు కావాల్సింది, కనీస అవసరాలైన రోడ్లు, నీళ్లు, డ్రైనేజీ, శానిటైజేషన్, స్ట్రీట్ లైట్స్, పార్కులు, ఇలా మౌలిక వసతులు కల్పించాలనే డిమాండ్ ప్రతి కాలనీలో ఉందన్నారు. కార్యక్రమంలో కృష్ణముదిరాజ్, ఆంజనేయులు, వినతాసింగ్ పాల్గొన్నారు.

కనీస వేతనాలు అందక కార్మికుల ఇబ్బందులు

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాజయ్య



జిన్నారం(పటాన్‌చెరు): పరిశ్రమల్లో కనీస వేతనాలు లేకపోవటంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజయ్య అన్నారు. జిన్నారం మండలంలోని బొల్లారం పారిశ్రామిక వాడలోని హార్టెక్స్ రబ్బర్ పరిశ్రమలో కనీస వేతనాలు కార్మికులకు ఇవ్వడంలేదని ఆరోపిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం డీసీఎల్‌కు ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పార్లే ఆగ్రోతో మెరుగైన వేతన ఒప్పందం

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాజయ్య

పటాన్‌చెరు టౌన్: కార్మికుల ఐక్యతతోనే పార్లే ఆగ్రో పరిశ్రమతో మెరుగైన వేతనం ఒప్పందం జరిగిందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కార్మిక సంఘం అధ్యక్షుడు రాజయ్య అన్నారు. మండలంలోని పాశమైలారం పార్లే ఆగ్రో పరిశ్రమలో సోమవారం డీసీఎల్ రవీందర్ రెడ్డి సమక్షంలో వేతన ఒప్పందం పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడారు. కార్మికుల ఐక్యతతో మంచి వేతన ఒప్పందం సాధించామన్నారు. కార్మికులు ఐకమత్యంగా ఉండటం వల్లే ఇది సాధ్యమైందన్నారు. సీఐటీయూ వచ్చిన తర్వా ఈ నాలుగేళ్లలో రెండు అగ్రిమెంట్ల ద్వారా రూ.19 వేలు పెరిగాయన్నారు. అగ్రిమెంట్‌కు సహకరించిన యజమాన్యానికి, కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పరిశ్రమ జీఎం మల్లికార్జున్ రెడ్డి, హెచ్‌ఆర్ కరీం, యూనియన్ ఆఫీస్ బేరర్స్ సంతోష్ కుమార్, రాజశేఖర్, జంగయ్య, కిరణ్, సుధాకర్, సుజిత్ తదితర కార్మికులు పాల్గొన్నారు.

పరిశ్రమల సహకారం అభినందనీయం

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): గ్రామాల అభివృద్ధిలో పరిశ్రమలు అందిస్తున్న సహకారం అభినందనీయమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. రూ.కోటి సీఎస్ఆర్ నిధులతో గుమ్మడిదల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేపట్టిన శ్లాబ్ నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పరిశ్రమల సహకారంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రవీణ, జెడ్పీటీసీ సభ్యుడు కుమార్‌గౌడ్, సర్పంచ్ నర్సింహారెడ్డి, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

'ఉర్దూ భాష మా బలం'

ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ ఐనుల్‌హసన్



ఖగోళ శాస్త్ర ఒలింపియాడ్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్

రాయదుర్గం: ఉర్దూ భాష మా బలహీనత కాదని, కానీ అది మా బలం అని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో అనువాదంపై 'స్కిల్ డెవలప్‌మెంట్' పేరిట వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాపకులు, విద్యార్థులు పరిశోధనలో చురుకుగా సహకరించాలని ప్రోత్సహించారు. ఎన్‌టీఎం నిపుణులు డాక్టర్ తారిఖ్‌ఖాన్, డాక్టర్ పి మాథ్యూ, డాక్టర్ అబ్దుల్ హలీమ్, డాక్టర్ మహ్మద్ అన్వర్, ఎస్ విన్‌స్టన్ క్రూజ్ తదితరులు ప్రసంగించారు. ఉపన్యాసాలు చేశారు. ప్రొఫెసర్లు అమీనాకిషోర్, అసదుద్దిన్, హరీష్‌నారంగ్, హరిబండలక్ష్మీ పాల్గొన్నారు.

'ఖగోళ శాస్త్ర ఒలంపియాడ్స్' పుస్తకావిష్కరణ

ఉర్దూ విశ్వవిద్యాలయంలోని అధ్యాపకులు రష్యన్‌భాషలో 'ఆస్ట్రానమీ ఒలంపియాడ్స్' పేరిట ప్రచురించిన పుస్తకాన్ని 'ఖగోళ శాస్త్ర ఒలింపియాడ్స్' పేరిట అనువదించారు. ఈ పుస్తకాన్ని వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ చేతుల మీదుగా ఆవిష్కరించారు.

ఆరు నెలలుగా డ్రైనేజీ సమస్య





టెలికాంనగర్‌లో రోడ్డుపై మురుగు నీరు

గచ్చిబౌలి: మ్యాన్ హోల్‌పొంగి ఆరు నెలలుగా మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. ఇంటి గుమ్మం పక్కన్నే మ్యాన్ హోల్ పొంగడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని టెలికాంనగర్‌లో కొంత కాలంగా డ్రైనేజీ సమస్య కాలనీ వాసులను పట్టి పీడిస్తోంది. ఆలస్య బా ఎదురుగా ఉన్న రోడ్డులో మ్యాన్ హోల్ పొంగడంతో కనీసం పాదచారులు వెళ్లడానికి వీలు లేకుండా ఉందని స్థానికులు వాపోతున్నారు. దోమలు, ఈగల బెడదతో రోగాల బారిన పడుతున్నామని, ఇప్పటికైన డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

తైలవర్ణ చిత్రాలు అద్భుతం: డీజీపీ



చిత్రకళాప్రదర్శనను తిలకిస్తున్న డీజీపీ అంజనీకుమార్, బీసీ కమిషన్‌చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు

గచ్చిబౌలి: ప్రకృతి రమణీయంగా, సహజత్వం ఉట్టిపడేలా చిత్రకారుడు హరి గీసిన తైలవర్ణచిత్రాలు అద్భుత కళాఖండాలని డీజీపీ అంజనీకుమార్ అభివర్ణించారు. శాంతిసరోవర్‌లో సహాయ ఫౌండేషన్, వీఎల్‌ఎల్ విజువల్ ఇంటర్నేషనల్ ఆర్ట్‌గ్యాలరీ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమాన్ని ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించి, బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావుతో కలిసి చిత్రకారుడు హరి గీసిన చిత్రాల ప్రదర్శనను ఆయన తిలకించారు. అనంతరం మాట్లాడుతూ సమాజంలో జరిగిన వివిధ సంఘటనలను, చూసిన వివిధ అంశాలను అత్యంత ప్రతిభావంతంగా చిత్రీకరించడం సామాన్య మైనదికాదన్నారు. డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహనరావు మాట్లాడుతూ తెలంగాణ సకల కళలకు కాణాచిగా భాసిల్లుతోందన్నారు. నిరాదరణకు గురైన అన్ని కళారూపాలు పూర్వవైభవాన్ని సంతరించుకుంటున్నాయన్నారు. అంతకుముందు కళాకారులు ఆలపించిన సినీగీతాలు, శాస్త్రీయ జానపదనృత్యాలు, మోడలింగ్, క్యాట్‌వాక్‌లు ప్రత్యేక ఆకర్షణగా మారాయి.

ఈఎస్ఐ అభివృద్ధి కమిటీ సభ్యుడిగా కృష్ణకాంత్



రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం ఈఎస్ఐ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడిగా తొంట కృష్ణకాంత్ సోమవారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సహకారంతో తనకు ఈ పదవి లభించిందన్నారు. అనంతరం స్థానిక నాయకులతో కలసి ఈఎస్ఐ ఆస్పత్రి సూపరింటెండెంట్ పద్మజను మర్యాదపూర్వకంగా కలిశారు.బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గోవింద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఐలేష్ యాదవ్ పాల్గొన్నారు.